క్లుప్తంగా

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

జహీరాబాద్ టౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా హోతి(కె) కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో ఫైర్‌సేఫ్టీపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక అధికారి పాలెం ప్రశాంత్ గ్యాస్ సిలిండర్‌కు మంటలు అంటుకున్నప్పుడు ఎలా ఆర్పాలి ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. ప్రమాదాల సమయంలో 101టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. వేసవికాలంలో అధికంగా అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో ఫైర్ సిబ్బంది నర్సింహరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, యూనుస్, ఆశోక్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో చేపట్టనున్న సీసీ రోడ్ల అభివృద్ధికి రూ.2.5 కోట్లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులు మంజూరైనట్లు ఎంపీపీ రవీందర్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు జిన్నారంలో శనివారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మంజూరైన నిధులతో కాజిపల్లి, దాచారం, నల్లూరు, కొడకంచి, శివనగర్, రాళ్లకత్వ, సోలక్‌పల్లి, ఇమామ్‌నగర్, ఊట్ల, మంగంపేట్, జగంపేట్, వావిలాల, లక్ష్మీగూడెం గ్రామాల్లో సీసీ రోడ్లను నిర్మిస్తామని తెలిపారు. జెడ్పీ వైస్‌చైర్మన్ ప్రభాకర్, ఆయా గ్రామాల ఎంపీటీసీలు జనాబాయి, లావణ్యనరష్, ఎంపీడీఓ అరుణారెడ్డి, ఎస్‌ఆర్‌ఈజీఎస్ అధికారి రామ్మోహన్, జిన్నారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణ, ఏఈ మల్లేశ్ పాల్గొన్నారు.

యువత క్రీడల్లో రాణించాలి

నారాయణఖేడ్: యువతకు క్రీడల్లో రాణించాలని ఖేడ్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రజినీకాంత్ తెలిపారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని నారాయణఖేడ్‌లోని అనురాధ కళాశాల గ్రౌండ్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నీని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత క్రీడలతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆకాష్, నాయకులు రాజు, రాహుల్ పాల్గొన్నారు.

దుండగులను అరెస్టు చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని మంగాపూర్ గ్రామానికి చెందిన దళిత సామాజికవర్గానికి చెందిన ఏర్పుల మల్లేష్‌పై దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులను నమోదు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బుచేంద్ర డిమాండ్ చేశారు. ఈ మేరకు హత్నూర పోలీస్టేషన్ వద్ద విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఏర్పుల మల్లేష్, ఇటీవల దౌల్తాబాద్ జాతరకు వెళ్లాడు. ఈ క్రమంలో కొంతమంది వ్యక్తులు జాతరకు నువ్వు ఎందుకు వచ్చావు అంటూ దూషించి మల్లేష్‌పై మూకుమ్మడిగా దాడి చేశారన్నారు. మల్లేష్‌ను కులం పేరుతో దూషించి అవమానించిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, జిల్లా కార్యదర్శి శాంతకుమార్, బీఎస్పీ నియోజకవర్గ నాయకులు స్వేరో ఆనంద్, సాయిలు, జిల్లా సహాయ కార్యదర్శి రాజీవ్, మాలమహానాడు హత్నూర మండల అధ్యక్షుడు ఎమ్మార్పీఎస్ నాయకులు నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిశీలన

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని బొల్లారం, ఖాజీపల్లి గ్రామాల్లోని ప్రభుత్వ, శిఖం భూములను తహశీల్దార్ భిక్షపతి, ఆర్‌ఐ జయప్రకాశ్‌నాయణ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ, శిఖం భూములను పరిరక్షించేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఖాజీపల్లిలో జరుగుతున్న అక్రమాలపై ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

సంక్షేమ పథకాలపై అవగాహన

జహీరాబాద్: స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలతో ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పిరామల్ ఎన్‌జీఓ సంస్థ సీనియర్ ప్రోగ్రాం మేనేజర్లు ఆశిష్, కాజల్‌దవేలు పేర్కొన్నారు. జహీరాబాద్‌లోని కెఫే ఎత్నిక్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలను విస్తరిస్తామన్నారు. ప్రోగ్రాం లీడర్లు సివిక్ బెనర్జి, కమలేశ్వరి పాల్గొన్నారు.

జన హృదయనేతకు శుభాకాంక్షలు

- ఘనంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు
- ప్రభుత్వాస్పత్రుల్లో పండ్లు పంపిణీ

జిల్లావ్యాప్తంగా మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అదేవిధంగా అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు.



రామచంద్రాపురం: మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు



సదాశివపేట పట్టణంలో కేక్ కట్ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు



జోగిపేట: కార్యకర్తకు కేక్ తినిపిస్తున్న అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్



పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కుమార్‌యాదవ్, నాయకులు



నారాయణఖేడ్: చిన్నారికి కేక్ తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



జిన్నారం: మాదారంలో కేక్ కట్ చేస్తున్న జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్



హత్నూర: దౌల్తాబాద్‌లో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న నాయకులు

మంత్రి దామోదరను కలిసిన నీలం మధు

పటాన్‌చెరు టౌన్: రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నీలం మధు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు తన వంతు పాత్ర పోషిస్తానని చెప్పారు. బీసీ కుల గణన చేపట్టడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సంతోషకరమన్నారు. బీసీ కులగణనతో బీసీలకు సామాజిక, ఆర్థికన్యాయం జరగడంతో పాటు రాజకీయంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ మున్సిపల్ కౌన్సిలర్ కొల్లూరు మల్లేష్, నారాయణరెడ్డి, అన్వర్ పటేల్, తిరుమల్‌రెడ్డి, సుంకరబోయిన మహేష్, ప్రభు, మల్లేష్, వంశీ, ప్రశాంత్, శంకర్, గోపాల్, అనిల్, నరేష్, ఎస్ఎంఆర్ యువసేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి దామోదరకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న నీలం మధు ముదిరాజ్

సంక్షిప్త వార్తలు

◆ అభివృద్ధికి సహకరించండి

సంగారెడ్డి టౌన్: మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఎంపీపీ లావణ్య అన్నారు. సంగారెడ్డి మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని సీసీ రోడ్ల నిర్మాణం, సమస్యలను పరిష్కరించాలని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఎండాకాలం సమీపిస్తున్న తరుణంలో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపాధిహామీ కూలీల బిల్లులు పూర్తిగా అందజేస్తామని ఎంపీడీవో యాదగిరి తెలిపారు. సమావేశంలో ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

◆ జహీరాబాద్ రూరల్ సీఐగా నవీన్‌కుమార్

న్యాల్‌కల్(జహీరాబాద్): జహీరాబాద్ రూరల్ సీఐగా నవీన్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పని చేసిన నోముల వెంకటేశం హైదరాబాద్‌లోని డీఐజీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సదాశివపేట సీఐగా పనిచేసిన నవీన్‌కుమార్ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

◆ బసవేశ్వరుడి పూజలు

జహీరాబాద్ టౌన్: మండల పరిధిలోని సత్వార్, గొటిగార్‌పల్లి, రంజోల్ తదితర గ్రామాల్లో బసవ భక్తులు శనివారం విశ్వగురువు బసవేశ్వరుడికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వీరశైవలింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో పట్టణంలోని బసవ కాంప్లెక్స్ వద్ద బసవేశ్వరుని విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వీరశైవలింగాయత్ సమాజ్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్ షెట్కార్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రీయ బసవదళ్ ఆధ్వర్యంలో పట్టణంలోని దత్తగిరి కాలనీలో బసవేశ్వరుడి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. కార్యక్రమంలో వీరశైవలింగాయత్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు శంకర్‌పాటిల్, నాయకులు శరణప్ప బసవభక్తులు, మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

న్యాల్‌కల్‌లో...

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్‌లోని మహాత్మ బసవేశ్వర విగ్రహానికి బసవదళ్ నాయకులు ప్రత్యేక పూజలు చేసి స్వీట్లు పంచుకున్నారు. కుల, మతాలకు అతీతంగా వ్యవహరించిన బసవేశ్వరుడి ఫోటోను ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలని ప్రకటించడం హర్షణీయమన్నారు. బసవదళ్ నాయకులు శివరాజ్, సిద్దన్న, నాగిశెట్టి, శాంతయ్య పేర్కొన్నారు.

◆ నీటి ట్యాంకుల ఏర్పాటు

నారాయణఖేడ్: ఖేడ్ మండల పరిధిలోని హన్మంతరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్ట్రీట్ కాస్‌లో భాగంగా హైదరాబాదు సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల దాహార్తిని తీర్చడానికి శనివారం రూ.లక్ష వరకు వెచ్చించి రెండు మినీ నీటి ట్యాంకులను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఆ సంస్థ అధ్యక్షుడు సాకేత్ మల్లెల, కార్యనిర్వాహక అధ్యక్షురాలు సౌమ్య, కోశాధికారి ఉష తదితరులు పాల్గొన్నారు. అనంతరం సంస్థ సభ్యులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు హీరామన్, శైలజ, భాగ్యమ్మ, సురేఖ, రాజేశ్వర్, రాఘవేందర్‌నాయక్, వెంకటేశం, శివాజీ, పంచాయతి కార్యదర్శి నగేష్ కలిసి ఘనంగా సన్మానించారు.

◆ డీఎస్పీని కలిసిన కాంగ్రెస్ నాయకులు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్ రెడ్డిని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు నరసింహారెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిసి గౌతమ బుద్ధుని ప్రతిమను బహూకరించారు. భానూర్ మాజీ సర్పంచ్, శ్రీహరి, కాంగ్రెస్ నాయకులు పాషా, యువరాజ్, హమీద్, కుంచల కిషన్, ఉమ్మర్, రాజు పాల్గొన్నారు.

◆ ఇంటి పన్నులు చెల్లించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతిఒక్కరూ సకాలంలో ఇంటి పన్నును చెల్లించి అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలో ఇంటి పన్నుల చెల్లింపులపై ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు.

◆ శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

ఝరాసంగం(జహీరాబాద్): శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని జహీరాబాద్ రూరల్ సీఐ నవీన్‌కుమార్ అన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శనివారం మండల కేంద్రమైన ఝరాసంగం పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎస్‌ఐ రాజేందర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

◆ పటాన్‌చెరు ఎంవీఐగా విజయరావు

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాజా మహ్మద్ కోదాడకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రంగారెడ్డి జిల్లా కొండాపూర్ ఆర్టీఓ కార్యాలయం నుంచి బదిలీపై విజయరావు వచ్చి పటాన్‌చెరు ఎంవీఐగా బాధ్యతలు తీసుకోనున్నారు.

◆ సంజీవరెడ్డిని కలిసిన నాయకులు

సంగారెడ్డి: జాతీయ ఐఎన్‌టీయూసీ 327 అధ్యక్షులు సంజీవరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ డివిజన్లలోని కార్మిక నాయకులకు సంగారెడ్డి జిల్లాకు 3 ప్రతిభ అవార్డులు రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్ రెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

జిన్నారం(పటాన్‌చెరు): మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలతో పాటు సోలక్‌పల్లిలోని మరో రెంటింటిని జిల్లా ఏడీఏ అధికారి శ్రీనివాస్‌రెడ్డి వ్యవసాయ అధికారి రవీంద్రనాథ్‌రెడ్డితో కలిసి శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు.

వ్యక్తి అదృశ్యం



నాగరాజు

పటాన్‌చెరు టౌన్: వ్యక్తి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన బత్తిని నాగరాజు(23) గత నెల జనవరి 19వ తేదీ ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో కుమారుడు అదృశ్యంపై తండ్రి బత్తిని జోగయ్య పోలీసులకు శనివారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వంట గ్యాస్ లీకై మహిళకు తీవ్ర గాయాలు

చికిత్స పొందుతూ మృతి



లక్ష్మి(ఫైల్)

జహీరాబాద్: పట్టణంలోని ఎస్‌బీహెచ్ కాలనీలో వంటగ్యాస్ లీకై ఒంటికి మంటలు అంటుకొని గాయపడి లక్ష్మి(58) శనివారం మరణించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 14వ తేదీన లక్ష్మీ వంట చేస్తున్న క్రమంలో సిలిండర్ నుంచి గ్యాస్‌లీకైంది. దీంతో లక్ష్మితో పాటు ఆమె భర్త బసంత్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. వీరిని హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ లక్ష్మి మరణించింది. బసంత్‌రెడ్డి కోలుకుంటున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సాఫ్ట్‌స్కిల్స్‌పై అవగాహన

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఆచార్య డిగ్రీ కళాశాలలో శనివారం టాస్క్(తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్) ఆధ్వర్యంలో క్యాంపస్ టూ కార్పొరేట్‌పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రెస్యూమ్ ప్రిపరేషన్, ఇంటర్వ్యూ, స్కిల్స్ కాన్ఫిడెన్స్, డ్రెస్ సెన్స్ తదితర అంశాల పట్ల అవగాహన కల్పించారు. అనంతరం టాస్క్ ట్రైనర్ అబ్దుల్ ముఖీత్ మాట్లాడుతూ ఉపాధి అవకాశాలు పొందాలంటే తప్పనిసరి నైపుణ్య శిక్షణ తీసుకోవడం ద్వారా మల్టీనేషనల్ కంపెనీలలో ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల హరికుమార్, టాస్క్ కోఆర్డినేటర్ నర్సింహులు, డైరక్టర్లు శ్రీనివాస్ రెడ్డి, అధ్యాపకులు నందుగౌడ్, నవీన, దత్తు, రమేష్, లావణ్య, శ్వేత, దీపిక, నిఖిత, సుల్తానా, వైష్ణవి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కరపత్రాల పంపిణీ

మునిపల్లి(అందోల్): శివాజీ విగ్రహావిష్కరణకు సంబంధించిన కరపత్రాలను శివాజీ సేనా యువజన సంఘం నాయకులు శివకుమార్‌రెడ్డి, నాగరాజు పటేల్‌లు ఆయా గ్రామాల్లో పంపిణీ చేశారు. శనివారం మండలంలోని తాటిపల్లి, పెద్దలోడి, మక్తక్యాసారం, గార్లపల్లి, చీలపల్లి, కల్లపల్లి బేల్సూర్ గ్రామాల్లో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ నెల 19వ తేదీన మండలంలోని పెద్దచల్మెడ గ్రామంలో శివాజీ విగ్రహావిష్కరణ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, నర్సింహ్మారెడ్డిలు, ఫెరోజ్‌ఖాన్ పాల్గొన్నారు.

రెవెన్యూ జిల్లా అధికారిగా పద్మజరాణి



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పద్మజరాణి

సంగారెడ్డి టౌన్: జిల్లా రెవెన్యూ అధికారిగా పద్మజరాణి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ క్రాంతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహించిన పద్మజరాణి బదిలీపై సంగారెడ్డికి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన డీఆర్‌ఓ నాగేష్ అదనపు కలెక్టర్‌గా పదోన్నతి పొంది వనపర్తి జిల్లాకు బదిలీ అయ్యారు.

పారిశుద్ధ్య నిర్వహణపై సమావేశం



సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు

కొండాపూర్(సంగారెడ్డి): మేడారం జాతరలో పారిశుద్ధ్య నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ, తదితర అంశాలపై చైతన్యం కలిగించే విధంగా కొండాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు శనివారం డెమో నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్‌గా మనస్విని, మంత్రిగా అయేషాసిద్ధికి, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్‌గా భవాని, కలెక్టర్‌గా ముస్కాన్, సీఈఓగా వెన్నెల, ఎంపీగా శ్రీకర్, ఎమ్మెల్యేగా మహబూబ్ తమ పాత్రలను నిర్వర్తించారు. ఈ సమావేశం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ స్పృహను రేకెత్తించారు. జాతరలో ప్లాస్టిక్ కవర్ల వినియోగాని దూరంగా ఉండాలన్నారు. వ్యర్థాలు, వసతులు, భక్తుల రద్దీ, ట్రాఫిక్ అంతరాయాలు, మరుగుదొడ్లు, పార్కింగ్, స్నానఘట్టాలు తదితర అంశాలపై చర్చించి తీర్మానాలు చేసి ఆకట్టుకున్నారు. సమావేశానికి పర్యవేక్షకులుగా మండల విద్యాధికారి, భీంసింగ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎలిజబెత్ వ్యవహరించారు. విద్యార్థులు చక్కటి ప్రతిభను కనబరచడంతో పాటు ఉపాధ్యాయుల మన్ననలు పొందారు.

ముగిసిన అంతర్జాతీయ సదస్సు

పటాన్‌చెరు: గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లోని అకౌంటింగ్ విభాగం ఆధ్వర్యంలో 'పర్యావరణ, సామాజిక, పాలనలో సమకాలీన సమస్యలు'(ఈఎస్‌జీ) అనే అంశంపై నిర్వహిస్తున్న రెండు రోజుల అంతర్జాతీయ సదస్సు శనివారంతో విజయవంతంగా ముగిసింది. ఈ సదస్సులో దేశం నలుమూలల నుంచి దాదాపు 154 సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. సదస్సులో నిపుణులు, మేధావులు, ప్రభుత్వ విధానాలు, నిబంధనలు, కార్పొరేట్ పద్ధతులు, పెట్టుబడి వ్యూహాలు, వాటాదారుల అభిప్రాయాలతో సహా ఈఎస్జీకి సంబంధించిన విస్తృత శ్రేణి అంశాలను చర్చించారు. సమావేశంలో ముఖ్య వక్తలు, ప్యానెలిస్టులు ఈఎస్‌జీ పద్ధతులను అమలు చేయడంలో సవాళ్లు, అవకాశాలను, ఈఎస్‌జీ లో సాంకేతికత పాత్ర, నిబంధనలలో అభివృద్ధి చెందుతున్న ధోరణులను ప్రస్తావించారు. వ్యాపార స్థిరత్వం కోసం ఈఎస్‌జీ అమలులో వాటాదారుల అభిప్రాయాలు, ఆందోళనలను అర్థం చేసుకోవడంలో ప్యానెల్ చర్చలు, పత్ర సమర్పణలు లోతైన అవగాహనను కల్పించాయి. పలువురు ప్రతినిధులు సదస్సు నిర్వహణ తీరు, గీతం ఆతిథ్యాలను ప్రశంసించారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని ఆయా గ్రామాల అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు మంజూరు చేయాలని గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకోగా నిధుల మంజూరు పత్రాలు జారీ అయినట్టు ఎంపీపీ నర్సింహులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా దౌల్తాబాద్‌లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల పరిధిలో 38 గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.2కోట్లు, 26 గ్రామ పంచాయతీలలో అంగన్వాడీ భవన నిర్మాణాలకు రూ.కోటి 76లక్షలు, 26 గ్రామ పంచాయతీల మరుగుదొడ్ల నిర్మాణాలకు రూ.77లక్షల నిధులు మంజూరైనట్లు తెలిపారు. నిధులు మంజూరు చేయించిన మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, ఎమ్మెల్యే సునీతారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కిషన్‌రావు, బీఆర్‌ఎస్ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు శివశంకరరావు, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు నరేందర్ యువత అధ్యక్షుడు కిషోర్ నాయకులు బుచ్చిరెడ్డి రామచంద్రరెడ్డి సతీష్, నవీన్‌గౌడ్, సాయి, శ్రీకాంత్, అజీజ్, రాజు, కిషన్‌గౌడ్, అజ్మత్‌అలీ, లక్ష్మణ్‌గౌడ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీ సేవలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న బ్యాంకు మేనేజరు రాజు

ఝరాసంగం(జహీరాబాద్): డీసీసీ బ్యాంకు అందించే సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఝరాసంగం బ్రాంచి బ్యాంకు మేనేజరు రాజు అన్నారు. ఝరాసంగంలోని ఐకేపీ కార్యాలయంలో ఐకేపీ ఏపీఎం బాలకృష్ణతో కలిసి బ్యాంకు సేవలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌హెచ్‌జీ ద్వారా రుణాలు, బంగారంపై రుణాలు అందిస్తున్నామని తెలిపారు. ఇన్స్రూ సౌకర్యంతో పాటు లాకర్ సౌకర్యం కల్పిస్తున్నటు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అసిస్టెంట్ మేనేజరు హరిక, సీసీలు మల్లేషం, యాదగిరి, నర్సమ్మ, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్, సీఏలు మహిళా సంఘాల షభ్యులు తదితరులు పాల్గొన్నారు.